క్లుప్తంగా

గాయకుడు కొండలస్వామికి సన్మానం



బాపట్ల: రఘుకుల తిలకా రారా అనే పాటతో ఎంతో ప్రాచుర్యాన్ని పొందిన బాపట్ల జిల్లా కర్లపాలేనికి చెందిన ఆటో డ్రైవర్ కొండలస్వామిని ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్ సన్మానించారు. గురువారం బాపట్ల వచ్చిన ఆయన కొండల స్వామిని శాలువాతో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ ఇలాంటి భక్తి గీతాలను కొండలస్వామి మరెన్నో ఆలపించాలని, సినీ అవకాశాలను సద్వినియోగం చేసుకొని మంచి గాయకుడిగా రాణించాలని ఆకాంక్షించారు. తాను కూడా సినిమా రంగంలో పాటలు పాడే అవకాశాలను కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట కొండలస్వామి కుమారుడు మణికంఠ స్వామి కూడా ఉన్నారు.

గోవులను వధించడం చట్టరీత్యా నేరం

రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు



రేపల్లె: ప్రశాంత వాతావరణంలో బక్రీదును జరుపుకోవాలని రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు సూచించారు. పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో గురువారం ముస్లిం మత పెద్దలు, బీజేపీ, ఆర్ఎస్ఎస్, విశ్వ హిందూ పరిషత్ సభ్యులతో నిర్వహించిన శాంతి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. గోవధ నిషేధ చట్టం ప్రకారం గోవులను హింసించడం, వధించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. గతంలో జరిగిన సంఘటనల ఆధారంగా గోవధ జరిగే ప్రాంతాలపై నిఘా ఉంటుందని చెప్పారు. పండుగను ప్రశాంతంగా జరుపుకునేందుకు ముస్లిం పెద్దలు సహకరించాలని ఆయన కోరారు. ఎక్కడైనా గోవధకు పాల్పడితే సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలని శాంతి కమిటీ సభ్యులకు తెలియజేశారు. సమావేశంలో పట్టణ సీఐ మల్లికార్జునరావు, మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీసు పెంపొందించేందుకే పల్లె నిద్ర

అందుకూరు(క్రోసూరు): పోలీసులంటే ప్రజల్లో ఉన్న భయాన్ని తగ్గించి స్నేహపూర్వక వాతావరణం కల్పించేందుకే పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ పి.రవిబాబు తెలిపారు. మండలంలోని అందుకూరులో గల రామాలయం వద్ద బుధవారం రాత్రి బస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలందరూ పోలీసులతో స్నేహపూర్వకంగా మాట్లాడవచ్చని తెలిపారు. గ్రామంలో సమస్యల్ని తమ దృష్టికి తీసుకు రావచ్చని ఆయన సూచించారు. ఘర్షణలు, గొడవలకు దూరంగా ఉండాలని చెప్పారు. సమస్యాత్మక విషయాలను వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కులమతాలు, భేదాభిప్రాయాలు , పట్టింపులు, సాటి మనిషి పట్ల ద్వేషభావాలు విడనాడి స్నేహపూర్వక వాతావరణంలో ప్రజలందరూ సుఖంగా జీవించాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామపెద్దలు ,ప్రజలు పాల్గొన్నారు.

సాయిల్ హెల్త్ కార్డులతో అధిక దిగుబడులు



వేమూరు: సాయిల్ హెల్త్ కార్డు ద్వారా ఎరువులు వాడడం వల్ల రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి సునీత తెలిపారు. మండలంలోని కుచ్చెళ్లపాడు రైతు భరోసా కేంద్రంలో గురువారం సాగు సయాయత్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులంతా పొలాల్లో మట్టి నమూనా తీసి ల్యాబ్‌కి పంపి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. పచ్చి రొట్ట విత్తనాలు 50 శాతం రాయితీపై అందిస్తున్నట్లు చెప్పారు. వరి విత్తనాలు కావాల్సిన వారు రైతు భరోసా కేంద్రాల్లో తెలియజేయాలని ఆమె సూచించారు. కౌలు రైతులంతా రెవెన్యూ శాఖ కార్యాలయం ద్వారా గుర్తింపు కార్డులు పొందాలని చెప్పారు. కౌలు రైతు కార్డు ఉండటం వల్ల వ్యవసాయ పథకాలను పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

తెనాలిరూరల్: వివాహిత అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ త్రీ టౌన్ స్టేషన్ పరిధిలో నివసించే 23 ఏళ్ల ప్రైవేటు స్కూలు టీచర్ చైతన్య బాలకుమారి కుటుంబ కలహాల నేపథ్యంలో బుధవారం రాత్రి ఇంటి నుండి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో పూర్తిగా వ్యతిరేకత

మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి

బాపట్ల : వైఎస్సార్ సీపీ చేపట్టిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమం విజయవంతమే ప్రభుత్వ వ్యతిరేకతను పట్టిచూపుతోందని మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పేర్కొన్నారు. స్వగృహంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందుకు ఇచ్చిన సూపర్‌సిక్స్‌లో కనీసం ఒక సిక్స్ కూడా కొట్టకపోవడంతో ప్రజా వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి ప్రజలు తండోపతండాలుగా రావడాన్ని జీర్ణించుకోలేని కూటమి ప్రభుత్వం ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం సరికాదని సూచించారు. అసెంబ్లీలోకి వచ్చి మాట్లాడ వచ్చుకదా అని ఒకరిద్దరు మంత్రులు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పేద ప్రజలను నేడు సంక్షేమ ఫలాలు కోసం ఏవిధంగా ఎదురుచూస్తున్నారో ప్రత్యక్షంగా ఈ నిరసనలో తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. అసెంబ్లీలో పచ్చ మీడియాతో ఏమీ మాట్లాడిన తొక్కిపెట్టే కూటమి ప్రభుత్వం ప్రజాక్షేత్రంలో ప్రజలు నిలదీయటాన్ని ఇష్టపడక ఏదో నోటికి వచ్చినట్లు మాట్లాడుతుందని విమర్శించారు. కలెక్టర్లకు ప్రజాసమస్యల పరిష్కారవేదికలో ఇచ్చిన అర్జీలు సైతం పట్టించుకోవడం లేదని తెలిపారు. వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చక పోగా, పెన్షన్లు తొలగించటాన్ని నిరసిస్తూ గుండు గీయించుకుని మరీ ఆవేదన వ్యక్తం చేశారని గుర్తు చేశారు. సర్టిఫికెట్ల విచారణ పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని దుయ్యబట్టారు. తెనాలిలో ఒక కేసులో యువకులను రోడ్డుమీదకు తీసుకువచ్చి కొట్టే అధికారం పోలీసులకు ఎవరు ఇచ్చారని కోన ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో రెడ్‌బుక్ రాజ్యాంగం కొనసాగుతుందని మరోసారి నిరూపణ అయిందని తెలిపారు. ప్రజలంతా గమనిస్తున్నారని, ఇప్పటికైనా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోన సూచించారు. బలమైన ప్రతిపక్షంగా ప్రభుత్వం ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందే వరకు వారి వెంట ఉండి పోరాడేందుకు సిద్ధంగా ఉంటామని ఆయన తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు ఏడుకొండలరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, జోగి రాజా, అనిల్, కొక్కిలిగడ్డ చెంచయ్య పాల్గొన్నారు.

కూటమి అసమర్థ పాలనపై ప్రజా తిరుగుబాటు

- వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్
- వెన్నుపోటు దినం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన



రేపల్లె: కూటమి ప్రభుత్వ సంవత్సర అసమర్థ పాలనపై ప్రజలు విసిగి వేసారిపోయారని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు.గుళ్లపల్లిలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేవలం సంవత్సర కాలంలోనే పాలక ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ప్రజా వ్యతిరేకత రావడం దేశ చరిత్రలోనే ఇదే ప్రథమమని పేర్కొన్నారు. ఎన్నికల ముందు అధికారం కోసం అమలు చేయలేని హామీలనిచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక బడ్జెట్ లేదంటూ సాకులు చెప్పడం కూటమి పాలకులకే చెల్లిందని విమర్శించారు. హామీలను అమలు చేయకపోగా రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో పోలీసులను కీలుబొమ్మలుగా వాడుకుంటున్నారని తెలిపారు. ప్రశ్నించే గొంతును నొక్కుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని గణేష్ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ సంవత్సర అసమర్థత పాలనను నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి విశేష మద్దతు లభించిందని పేర్కొన్నారు. పోలీసుల ఆంక్షలను ఎదిరించి ప్రజలు స్వచ్ఛందంగా రోడ్డుపైకి వచ్చి ప్రభుత్వ అసమర్థతను ఎండగట్టారని తెలిపారు. రేపల్లె నియోజకవర్గంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనడం ఆనందంగా ఉందని చెప్పారు. వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ డాక్టర్ ఈవూరు గణేష్ కృతజ్ఞతలు తెలిపారు.

పొద్దెక్కినా అధికారులకు తీరలేదు !

- తెరుచుకోని పలు ప్రభుత్వ కార్యాలయాలు
- విధుల్లో ప్రభుత్వ ఉద్యోగుల నిర్లక్ష్యం
- సమయపాలనకు మంగళం



ఆదర్శ మండల మహిళ సహాయక సహకార సంఘం కార్యాలయం



గృహ నిర్మాణం శాఖ కార్యాలయం

వేమూరు: ప్రభుత్వ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సమయపాలన పాటించడం లేదు. ఉదయం 10:30 గంటలకు కూడా కార్యాలయాల తాళాలు తీయడం లేదు. సాక్షి గురువారం పలు ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించింది. వేమూరు మండలంలోని ఆదర్శ మండల మహిళ సహాయక సహకార సంఘ కార్యాలయం, గృహ నిర్మాణం శాఖ కార్యాలయాలు సమయానికి తెరుచుకోలేదు. ఉపాధి హామీ పథకం కార్యాలయాన్ని తెరిచినా, సిబ్బంది రాక కుర్చీలు ఖాళీగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అధికారులు కూడా సక్రమంగా విధులకు హాజరు కావడం లేదు. వేమూరు ఎంపీడీవోకి చీరాల పంచాయతీ డివిజనల్ ఇన్‌చార్జి అధికారి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన మండల పరిషత్ కార్యాలయానికి వారంలో నాలుగు రోజులు విధులకు వస్తారు. ఇక్కడ పనిచేసే పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీరు కార్యాలయం, అధికారి, గృహ నిర్మాణం శాఖ కార్యాలయం సిబ్బంది, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది విధులకు ఎపుడు వస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఆదర్శ మండల మహిళ పరస్పర సహాయక సహకారం కార్యాలయం సిబ్బంది కూడా అదే తంతులో కొనసాగుతున్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు పరిస్థితి అదే విధంగా ఉందని ప్రజలు కూడా అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అంతర్ పంటలతో అదనపు ఆదాయం



పైర్లను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయం అధికారులు

కర్లపాలెం: అంతర్ పంటలతో రైతులకు అదనపు ఆదాయం వస్తుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.వాణిశ్రీ చెప్పారు. ప్రకృతి వ్యవసాయం ఏడీఏలు, ఏవోలకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం ఆల్లూరులో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగవుతున్న పంటలను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వాణిశ్రీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కొంతమంది రైతులను ఎంపిక చేసుకుని వారితో ప్రకృతి వ్యవసాయం చేసే విధంగా కృషి చేయాలని సిబ్బందికి చెప్పారు. ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర కోఆర్డినేటర్ రామచంద్రం మాట్లాడుతూ ముందుగా పచ్చిరొట్ట పైర్లను సాగు చేసి వాటిని భూమిలో కలియదున్నుకోవడం వల్ల సారవంతమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి, అడిషనల్ డీపీఎం మోహన్, ఉద్యాన శాఖ, ప్రకృతి వ్యవసాయం అధికారులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో సాగు నీరు విడదల

అమర్తలూరు(వేమూరు): వచ్చే నెలలో ప్రభుత్వం సాగు నీటిని విడుదల చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి ఉయ్యూరి లోకేశ్వరి తెలిపారు. అమర్తలూరు మండలంలోని ప్యాపర్రు, యలవర్రు గ్రామాల్లో గురువారం ముందస్తు ఖరీఫ్‌పై రైతులకు ఆమె పలు సూచనలు చేశారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున రైతులు పంట కాలువల మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె చెప్పారు. ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

రేపల్లె / వేమూరు : పీడర్లలో మరమ్మతుల దృష్ట్యా రేపల్లె పట్టణంలోని జగనన్న కాలనీ, మండలంలోని పోటుమెరక, పాలకుర్తి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డెప్యూటీ ఈఈ డి.శ్యామ్ సుధాకర్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

- ఇంటూరు ఫీడర్ పరిధిలోని తురుమిళ్ల, మోపర్రు, ప్యాపర్రు, బోడపాడు, ఇంటూరు, వామన గుంట పాలెం, గోపయ్య పాలెం, మదిపాలెం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు అసిస్టెంట్ ఇంజనీరు దోనేపూడి అర్జునరావు తెలిపారు.
- వలివేరు ఫీడర్ పరిధిలో విద్యుత్ లైనుల మరమ్మతుల దృష్ట్యా వలివేరు, అయిన పాలెంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపి వేయనున్నట్లు అసిస్టెంట్ ఇంజనీరు దోనేపూడి అర్జునరావు తెలిపారు.
- విద్యుత్ లైన్ మరమ్మతుల దృష్ట్యా పెరవలిపాలెంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపి వేయనున్నట్లు అసిస్టెంట్ ఇంజనీరు గోపి తెలిపారు.

పని గంటల పెంపుదల నిర్ణయం అమానుషం

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్



బస్టాండ్ సెంటరులో ఫ్లకార్డులతో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

రేపల్లె: కార్మికుల పని గంటలను 8 నుంచి 10 గంటలకు పెంపుదల చేస్తూ పాలక ప్రభుత్వాలు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం అమానుషమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్. మణిలాల్ పేర్కొన్నారు. కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం బస్టాండ్ సెంటరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యమాల ద్వారా కార్మికులు సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని మండిపడ్డారు. ఇప్పటికే నాలుగు లేబర్ కోడ్‌లను అమలులోకి తెస్తూ కార్మికులను కట్టుబానిసలుగా చేసే కుట్రలకు పూనుకుంటోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు మద్దతునిస్తూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా కార్మికుల హక్కులు కాలరాసేలా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. కార్మికులకు అన్యాయం చేస్తూ పెట్టుబడిదారులకు లాభం చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ సమావేశంలో 10 గంటలకు పెంపుదల చేస్తూ నిర్ణయం తీసుకోవడం అమానుషమని తెలిపారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని మణిలాల్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యు.రామకృష్ణ ప్రసాద్, డి.ప్రభాకరరావు, కె.రమేష్, యు.వాసు, వి.సుబ్బారావు, డి.నాగరాజు పాల్గొన్నారు.

రేపు సరస్వతీ దేవాలయం భూమిపూజ

తెనాలి: పట్టణ బుర్రిపాలెంరోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూలు దగ్గర నూతనంగా నిర్మించనున్న 'సువర్ణ భారతి క్షేత్రం' (సరస్వతి దేవాలయం)కు ఈనెల 7న జరగనున్న భూమి పూజ ఆహ్వాన పత్రికను గురువారం ఆవిష్కరించారు. స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో ఆహ్వానపత్రికను ఆవిష్కరించి వివరాలను తెలియజేశారు. పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ)చే ఆరోజు ఉదయం 7.45 గంటలకు విశేష హోమాలు, పూజలు ఆధ్యాత్మిక ప్రవచనాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో బాలస్వామీజీతో పాటు ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకటకృష్ణమూర్తి, కార్యదర్శి రావూరి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, కోశాధికారి గోపు రామకృష్ణ, తాడిబోయిన వీరరాఘవయ్య, ఏలూరి రాజేశ్వరరావు, పసుపులేటి మాణిక్యారావు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



కళాశాల ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు



మొక్కను నాటుతున్న ఆర్డీవో రామలక్ష్మి



మొక్కలు నాటుతున్న చందోలు ఎస్ఐ శివకుమార్ యాదవ్ దంపతులు



ఎంవీరాజుపాలెం పాఠశాలలో మొక్కను నాటుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

బాపట్ల: మొక్కలు నాటడం వల్ల పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని డాక్టరు ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల డీన్ వినోద పేర్కొన్నారు. బాపట్లలోని కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వినోద మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ' బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్' అనే థీమ్‌పై వ్యాస రచన పోటీలు నిర్వహించి, విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సీహెచ్. సోమేశ్వరరావు, వై అరుణ కుమారి, బ్లెస్సీ సాగర్, నివేదిత, సునీత, దిలీప్ సేన్, నూకరత్నం, లావణ్య, ఫణీంద్ర పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలి

కర్లపాలెం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో జరిగిన వన మహోత్సవంలో భాగంగా ఎంవీరాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అధికారులు, ప్రజా ప్రతినిధులు మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇళ్లలో కూడా మొక్కలు పెంచాలని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, ఆయుర్వేద వైద్యులు సిద్ధార్థ, ఎంఈవోలు మనోరంజని, విజయశ్రీ , పంచాయతీ కార్యదర్శి సునీత, టీడీపీ మండల కన్వీనర్ వై.భూపతిరావు, నాయకులు షేక్ బాజీ, బుల్లియ్య పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

రేపల్లె: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆర్డీవో నేలపు రామలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మండలంలోని పట్టణంలోని పెనుమూడి రోడ్డులో గురువారం నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. పర్యావరణాన్ని పరిరక్షించే చెట్లను పరిరక్షించాలని తెలిపారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటడంతో పాటు వాటి పెంపకానికి కృషి చేయాలని ఆమె చెప్పారు. వాతావరణ సమతౌల్యం సాధించాలంటే చెట్ల సంరక్షణ తప్పనిసరి, ప్రతి ఒక్కరూ తమ పుట్టిన రోజున ఒక మొక్కను నాటి దాన్ని పెంచే బాధ్యతను తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు

చందోలు(కర్లపాలెం): పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని చందోలు ఎస్ఐ ఎం.వి. శివకుమార్ యాదవ్ చెప్పారు. వన మహోత్సవంలో భాగంగా గురువారం చందోలు బగళాముఖి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఈవో నరసింహమూర్తి ఆధ్వర్యంలో శివకుమార్ దంపతులు మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మొక్కలు దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి నరసింహమూర్తి, ఆలయ పూజారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

వేమూరు: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తహసీల్దారు సుశీల తెలిపారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని, అందుకోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు పాల్గొన్నారు.

• కూటమి వంచనపై ఆకట్టుకున్న శకటాలు



కూటమి ప్రభుత్వం హామీలిచ్చి అమలు చేయని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించేలా ఏర్పాటు చేసిన వాహనాలు



వాహనాలను రోడ్డుపైకి రాకుండా అడ్డుకుంటున్న పోలీసులు



మొసలిపాడు వద్ద మాట్లాడుతున్న వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం కొల్లూరులో నిర్వహించిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి ప్రజల నుంచి పెద్దఎత్తున స్పందన లభించింది. సంక్షేమ పథకాలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్న వైనాన్ని కళ్లకు కట్టినట్లు చూపేందుకు ఏర్పాటు చేసిన శకటాలు ఆకట్టుకున్నాయి. ప్రజల్లో ఆలోచనలు రేకెత్తించాయి. శకటాలను ముందుకు కదలనివ్వకుండా అడ్డంకులు సృష్టించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ప్రజలకు సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీల అమలు విషయంలో పూర్తిగా విఫలం చెందిందని మండిపడ్డారు.

– కొల్లూరు

విజయవాడ వెళ్ళిన ఉద్యోగులు

తెనాలి అర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో గురువారం జరిగిన మహాసభలకు తెనాలి నుంచి పలువురు ఉద్యోగులు ప్రత్యేక బస్సుల్లో వెళ్లారు. కార్యక్రమంలో వివిధ ఉద్యోగ సంఘ నాయకులు శివరాత్రి శ్రీనివాసరావు, అందె బాలచంద్రమౌళి, కారుమూరి కమలకుమారి, మనోహర్ రెడ్డి, దగ్గుపాటి సుధీర్‌కుమార్, గుంటూరు పూర్ణప్రసాద్ పాల్గొన్నారు.